విద్యుత్ స్తంభంపై తీగ మొక్కలు తొలగించరా....?

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని అడ్డరోడ్డు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభానికి తీగజాతి మొక్కలు అలముకున్నాయి. నిత్యం అధికారులు తిరిగే ప్రదేశంలో ఈ విద్యుత్ స్తంభానికి తీగ మొక్కలు కనిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా జరిగే స్తంభాలకు ఇటువంటి మొక్కలు రావడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంత నిర్లక్ష్యమేల....?

వెన్నెలపాలెంలో కల్వర్టుకు రంధ్రం

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండలం వెన్నెల పాలెం గ్రామంలో కల్వర్టుకు రంధ్రం పడి సుమారు రెండు నెలలు అవుతున్న ఇప్పటికీ ఎవరో స్పందించకపోవడంతో నిర్లక్ష్యం ఎంత మేర అన్నది కనిపించకనే కనిపిస్తుంది. నాతవరం మండల కేంద్రానికి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. మండల కేంద్రానికి ప్రధాన రహదారైన ఆర్ అండ్ బి రోడ్డు మధ్యలో వెన్నెల పాలెం వద్ద కల్వర్టుకు రంధ్రం పడింది. ఆర్ అండ్ బి అధికారులు పరిశీలించకపోవడం నిర్లక్ష్యమా, లేదా మండల నాయకులు ఇతర అధికారులు ఆర్ అండ్ బి అధికారులు దృష్టికి తీసుకువెళ్లకపోవడం నిర్లక్ష్యమా అన్నది తెలియడం లేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కల్వర్టుకు పడిన రంధ్రాన్ని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగితే దానికి బాధ్యత ఎవరు అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో మారణకాండ చేయొద్దు

కేంద్రం మావోయిస్టులను చర్చలకు పిలవాలి

అల్లూరి, అనకాపల్లి సీపీఐ జిల్లా కార్యదర్శులు పొట్టిక, మాకిరెడ్డి

విశాలాంధ్ర - గొలుగొండ: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను నిర్మూలించాలని ఇప్పటివరకు 435 మందిని చంపి బిజెపి ప్రభుత్వం పొట్టను పెట్టుకుందని అల్లూరి, అనకాపల్లి సీపీఐ జిల్లా కార్యదర్శులు పొట్టిక సత్యనారాయణ, మాకిరెడ్డి రామనాయుడు ఆరోపించారు. శుక్రవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతం కృష్ణా దేవి పేటలో మీడియాతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అటవీ సంపదను కొల్లగొట్టడానికి అమాయక గిరిజన ప్రజలను, ప్రభుత్వాలను ప్రశ్నించకుండా సిపిఐ మావోయిస్టులను అడ్డు తొలగించాలని దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారని వారు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచనలలో మార్పు చేసి మావోయిస్టులను చర్చలకు పిలిచి ప్రజల సమస్యలపైన పరిష్కరించే దిశగా వారితో చర్చలు జరపాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు, యువజన స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ప్రజానీకం అంతా ఏకమై కేంద్ర ప్రభుత్వానికి పాడి కట్టే రోజులు దగ్గరకు వస్తాయని ఈ సందర్భంగా ఘాటుగా విమర్శించారు.

నక్కపల్లిలో ఘనంగా తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - నక్కపల్లి : మండలంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపమాక ఆర్చ్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ర్యాలీలో ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత "భారత మాత కీ జై, వందేమాతరం" నినాదాలు చేసి జాతి పట్ల తన గౌరవాన్ని వ్యక్తం చేశారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు నివాళు లర్పిస్తూ, ఇటీవల విజయవంతమైన ఆపరేషన్ సింధూర్‌పై మంత్రి భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ సైనికులు వీరోచితంగా దేశ రక్షణ కోసం పోరాడుతున్నారన్నారు. పిఎం, సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పహల్గాంలో తెలుగువారు ఇద్దరు సహా పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన బాధాకరమన్నారు. ఆపరేషన్ సింధూర్‌కు ఇద్దరు మహిళలు నాయకత్వం వహించడం గర్వ కారణమని పేర్కొన్నారు. మన దేశ ఐక్యతను దెబ్బతీయాలనే ఉగ్రవాదుల ప్రయత్నాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని మంత్రి చెప్పారు. 23 ఏళ్ల మురళీ నాయక్ దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆయన తల్లికి సెల్యూట్ చేయాలన్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. మత విద్వేషాలు రేకెత్తించే వారిపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాజీ సైనికులను సన్మానించి, వారి సేవలను ప్రశంసించారు.

దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ రవిబాబు, డాక్టర్ షకీనా అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడ ఏడిస్ ఈజిప్టై దోమకాటు ద్వారా డెంగ్యూ వ్యాధి వస్తుందని, ఈ దోమపైన నల్లటి, తెల్లని చారలు వలన దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారన్నారు. ఈ దోమలు ఇంటి లోపల, ఆవరణలో ఉంటాయని, పగటిపూట మాత్రమే కుడతాయన్నారు. డెంగీ వైరస్‌తో ఇన్ఫెక్ట్ దోమలోనే కాకుండా దోమ గుడ్లలో కూడా వైరస్ ఉంటుందన్నారు. ఈ దోమ మంచినీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుందని, ఇంటిలో నీరు నిల్వలు ఉన్న పాత్రలపైన మూతలు పెట్టాలన్నారు. దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ళ నొప్పులు, కళ్ళు నొప్పులు, నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకుడు సునీత ఉమా మహేష్, పిహెచ్‌సి సిబ్బంది గణేష్, ఇందిర, లక్ష్మి, నాగేశ్వరరావు, కరుణ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించాలి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ఎం.పి.డి.ఓ. కార్యాలయంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్యాంకర్లు సమావేశం నిర్వహించారు. రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో రుణాలు అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. వివిధ బ్యాంకులలో రుణాలు అందించే తీరు తెన్నులు బ్యాంకర్లను, వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలు సాధించని బ్యాంకర్లు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు, కౌలు రైతులకు సత్వరమే రుణాలు అందించాలని, వారి అవసరాలకు తగ్గట్టుగా రుణాలు అందించే దిశగా పని చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత సాధన దిశగా ప్రత్యేక ట్రైనింగ్ సిబ్బందిని క్లస్టర్స్ వారీగా నియామకం చేసినట్లు, ఈ విషయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్స్ అందరూ వారితో కలసి గ్రామస్థాయి లో ఆర్థిక అక్షరాస్యత సాధన దిశగా పని చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ద్వారా అందిస్తున్న పి.ఎం. సూర్యాగర్ స్కీమ్ ద్వారా అందరు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి అని అందుకు బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఈఓఆర్డీ ఓ.మహేష్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రాల్లో మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - గొలుగొండ: స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పశు వైద్య కేంద్రాలు పరిసరాల్లో వివిధ రకాలైన మొక్కలు నాటి ఆహ్లాదకరంగా ఉంచాలని పశు సంవర్ధక ఉపసంచాలకులు డాక్టర్ చందక నరసింహులు తెలిపారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణాదేవి పేట గ్రామంలో ఉన్న పశు వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక పశు వైద్యశాలలో మూగజీవాలకు అందుతున్న సేవలపై డాక్టర్ శిరీష అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువైద్యశాలలో రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పశు వైద్యశాల పరిసరాల్లో విరివిగా మొక్కల నాటాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడుగా లింగంనాయుడు

విశాలాంధ్ర - కోటవురట్ల: మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడిగా బికేపల్లి సర్పంచ్ పెట్ల లింగం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత నక్కపల్లిలో గల పార్టీ ఆఫీసులో మండల టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. తెదేపా సీనియర్ నాయకులు లాలం కాశీ నయుడు, జానకి శ్రీనివాసరావు, జనార్ధన్, భాస్కరరావు, సూర్య ప్రకాష్, సుంకర బాబ్జి, తిరుమలరావు, ఎండపల్లి చంటి, బోడపాలెం సత్తిబాబు, తదితర నాయకులతో సమాలోచనలు జరిపారు. నాయకుల అందరి ఏకాభిప్రాయంతో బాపిరాజు కొత్తపల్లి సర్పంచ్ పెట్ల లింగం నాయుడుని మండల తెదేపా నూతన అధ్యక్షుడిగా, కొడవటిపూడి ఎంపీటీసీ ఎలమంచిలి సూర్య ప్రకాష్‌ని జనరల్ సెక్రెటరీగా ఎంపిక చేశారు. రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత, మండల తెదేపా సీనియర్ నాయకులు అందరి ఏకాభిప్రాయంతో మండల పార్టీ అధ్యక్షులుగా సెక్రెటరీగా ఎన్నుకున్నందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. ఇప్పటివరకు మండల తెదేపా అధ్యక్షులుగా పనిచేసిన జానకి శ్రీనివాసరావు కి సముచిత స్థానం కల్పిస్తానని హెూం మంత్రి అనిత హామీ ఇచ్చినట్లు తెదేపా నాయకులు తెలిపారు.

రూ.20 లక్షలు భీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు 2023 డిసెంబరు 29వ తేదీన కందిపూడి చెరువు వద్ద భారీ క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. కొంకిపూడి నాగేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో సేవింగ్ అకౌంట్ ఉంది. ఈ ఖాతా ద్వారా జనరల్ ఇన్సూరెన్స్‌లో 1000 రూపాయలు చెల్లించి ప్రమాద భీమా పాలసీ తీసుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మరణించిన నాగేశ్వరరావు కుటుంబానికి భీమా సొమ్ము రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ ఇన్స్యూరెన్స్ సొమ్మును శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో కొంకిపూడి నాగేశ్వరరావు భార్య కొంకిపూడి పద్మావతి (నామినీ)కి రూ. 20 లక్షలు చెక్కును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అనకాపల్లి రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఇన్స్యూరెన్స్ ఏరియా మేనేజర్ జి.సురేష్ బాబు, అనకాపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.మోహన్ రెడ్డి, బ్రాంచి మేనేజర్ ఎస్.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత స్థాయికి: ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్న మొసయ్యపేట గ్రామంలో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో జూనియర్ కళాశాల అదనపు గదులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, పుర్రె శ్రీను, ఉపాధ్యాయునిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బి.సి.టి వద్ద స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలంలో కృష్ణంపాలెం శివారు నారప్పపాలెం గ్రామాన్ని తరలించే క్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి నిమిత్తం ఈ నెల 6వ తేదీన రూ.8.36లక్షలు ప్రకటించారు. దీనిపై గ్రామస్తులంతా తాము అంగీకరించడం లేదంటూ, తమకు రూ.25లక్షలు కావాలని, అలాగే అచ్యుతాపురం మండలం రావిపాలెం తమ గ్రామాన్ని తరలిస్తారన్నారని, కానీ తాము కంపెనీలో ఏదైనా ఉద్యోగానికి రావాలి అంటే సుమారు 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది కనుక తమకు సమీప గ్రామమైన వెంకటాపురం బి.సి.టి వద్ద గల ప్రభుత్వ స్థలం కేటాయించాలంటూ శుక్రవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవి కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నారప్పపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్: డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ్య మలేరియా అధికారి, ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకొని జోనల్ మలేరియా అధికారి, ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎం.శాంతి ప్రభ ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీపై అవగాహన ర్యాలీని స్థానిక జిల్లా మలేరియా ఆఫీసు నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు నిర్వహించారు. డెంగీ అవగాహన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు. అనకాపల్లి పట్టణం ప్రధాన కూడలిలో మానవహారంగా నిలిచి డెంగ్యూ నివారణపై అనేక నినాదాలు చేశారు. జిల్లా మలేరియా అధికారి కె. వరహాలు దొర మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి మానవాళికి చాలా ప్రమాదకరమని చెబుతూ డెంగ్యూ నివారణకై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికార్లు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎ.ఎన్.ఎం.లు, లేబ్ టెక్నీషియన్లు, ఆశ కార్యకర్తలు వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: డెంగీ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.విమల గిరి ప్రజలకు సూచించారు. మండలంలో మునగపాక, మూలపేట గ్రామాలలో డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విమల గిరి మాట్లాడుతూ వారానికొక రోజు నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి డ్రై డే పాటించాలని సూచించారు. తద్వారా డెంగ్యూను అరికడదామన్నారు. డెంగీ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగీ జ్వరం లక్షణాలు, డెంగీ వ్యాప్తి చెందే విధానంపై వివరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదారి జగన్నాథరావు(జెకె బ్రదర్), గ్రామ ప్రజలు, పీహెచ్చీ సిబ్బంది పాల్గొన్నారు.

యస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.వాసంతి మాట్లాడుతూ ఈ డెంగీ అనేది దోమ కాటుతో వస్తుందని ఎక్కువగా మురుగునీటి నిలిచి ఉన్న చోట ఎక్కువగా డెంగీ సంభవిస్తుందన్నారు. ఈ సీజన్‌లో జ్వరాలు, తలనొప్పి అధికంగా వస్తాయని ముందుగానే వైద్యులు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి టి.నాగేశ్వరరావు, పిహెచ్ఎన్ రత్న సఖి, హెల్త్ సూపర్వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కర్రి సాయికృష్ణ

విశాలాంధ్ర - మునగపాక: అమరావతి సెక్రటేరియట్లో గల రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడుని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గంలోని పలు సమస్యలను చంద్రబాబుకు వివరించారు.

యూజేఎఫ్ లక్ష్యం ప్రశంసనీయం: అడిషనల్ ఎస్పీ (క్రైమ్) మోహన్ రావు

విశాలాంధ్ర - అనకాపల్లి: ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రెండ్ లక్ష్యం ప్రశంసనీయమని, సమాజ హితమే ధ్యేయంగా జర్నలిస్టులు పనిచేస్తారని, అంకితభావం, దృఢ సంకల్పంతో అనేక ఒత్తుడులను ఎదుర్కొని ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎల్.మోహన్ రావు అన్నారు. ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ (యూజెఎఫ్) అధ్యక్షులు ఎం.ఆర్. ఎన్.వర్మ సారథ్యంలో రూపొందించిన డైరీ, పాకెట్ బుక్‌ను శుక్రవారం ఎస్పీ కార్యాలయ ఆవరణంలో అడిషనల్ ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సమస్యలపై యూజేఎఫ్ చేస్తున్న కృషి అద్భుతమని అన్నారు. జర్నలిస్టులు కేవలం వార్తలకే పరిమితం కాకుండా ప్రశ్నించలేని ప్రజల పక్షాన వార్తా కథనాల ద్వారా నిలబడుతున్న యూజెఎఫ్ ప్రతినిధులను అభినందించారు.

యూజేఎఫ్ విశాఖ యూనిట్ అధ్యక్షులు, ఏపియుడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే.రాము మాట్లాడుతూ యూజేఎఫ్ అధ్యక్షులు డాక్టర్. ఎం.ఆర్.ఎన్.వర్మ సామాజిక స్పృహతో దశాబ్ద కాలానికి పైగా నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో యూజేఎఫ్ సమన్వయకర్త డి.హరనాథ్, అనకాపల్లి జిల్లా జర్నలిస్టులు భీమరశెట్టి వెంకటేష్ , షేక్ షాండ్ భాష, కాండ్రేగుల మోహన్ బాబు, పైలా రామారావు, బయ్యా కొండలరావు, ఈ షణ్ముఖ, మొల్లేటి గంగాధర్, గంటా శ్రీనివాసరావు, పొలిమేర నాగ శ్రీను, కోరుబిల్లి గణేష్, సింగర్ రాజు, బోని గణేష్, వై. నాగు, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీ వ్యాపారం ఎలా ఉందమ్మా...

టీ స్టాల్ వద్ద టీ తాగి సాదకబాదకాలు తెలుసుకున్న హోంమంత్రి అనిత

విశాలాంధ్ర -యస్.రాయవరం: మండలంలో ముఖ్య వ్యాపార కేంద్రమైన అడ్డు రోడ్డు ఫ్లైఓవర్ వంతెన వద్ద ఉన్న టీ దుకాణం ఎదుట రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కారు ఆపారు. మంత్రి అనిత స్వయంగా కారు దిగి ఒక మహిళ నిర్వహిస్తున్న టీ దుకాణం వద్దకు వెళ్లి అమ్మ నీ వ్యాపార ఎలా జరుగుతుందని అడిగారు. ఆమె టీ పెట్టి మంత్రికి ఇవ్వడంతో టీ తాగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనకు సొంత ఇల్లు లేదని అనడంతో మంత్రి స్పందిస్తూ తక్షణం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.

19న వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహణపై సమావేశం

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఈనెల 19న మండల వైస్ ఎంపీపీ ఎన్నికకు సంబంధించి ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని మాడుగుల ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందన్నారు. కావున ఈ సమావేశానికి మండలంలో గల ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు పంచాయతీల్లో సాసా కార్యక్రమం

విశాలాంధ్ర - సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టరేట్ మార్గనిర్దేశాల ప్రకారం ప్రతి మూడవ శనివారాన్ని సాసా పేరుతో కార్యక్రమం నిర్వహించబడుతుందని స్థానిక ఎంపీడీఓ పి. పద్మజ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాసా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న మండలంలోని 24 పంచాయతీల్లో "బీట్ ది హీట్" అనే థీమ్ తో కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటడం,నీటి సంరక్షణ, చలి వేంద్రాలు ప్రతి పంచాయితీలో నిర్వహించబడతాయని తెలిపారు.